క్లుప్తంగా

కార్తీక దీపోత్సవం



వీరభద్రేశ్వరుడి సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ధారూరు: కార్తీకమాసం సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. సోమవారం ధారూరు వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో భక్తులు దీపోత్సవం నిర్వహించారు. ఇళ్ల ముందు మహిళలు దీపాలు వెలిగించారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

యాలాల: ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్ 14 విభాగంలో యాలాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. ఖమ్మం జిల్లాలో ఆదివారం జరిగిన అథ్లెటిక్స్, డిస్క్ త్రోలో బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శివకుమార్ మూడో ర్యాంకు, బాలికల విభాగంలో అర్చన 6, నందిని 8వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈఓ, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సామూహిక యజ్ఞం



యజ్ఞం చేస్తున్న భక్తులు

పూడూరు: మండల పరిధి కడుమూరు గ్రామంలోని శివాలయంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం సామూహిక యజ్ఞాలు నిర్వహించారు. అఖండ నామస్మరణ చేశారు. గ్రామ సమీపంలోని ఈసీ వాగు నుంచి తెచ్చిన నీటితో కుంభాభిషేకం చేశారు. రాకంచర్ల పీఠాధిపతి వెంకటదాసు ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను జయప్రదం చేయాలని వారు కోరారు.

రేపు శాస్త్రవేత్తలతో ముఖాముఖి

బొంరాస్‌పేట: ఏరువాక కేంద్రం తాండూరు వారి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం రైతు వేదికలో యాసంగి పంటల గురించి రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి ఉందని ఏఓ తులసి తెలిపారు. ఉదయం 10గంటలకు రైతు సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తారని, సలహాలు, సూచనలు ఇస్తారని, అభిప్రాయాలు సేకరిస్తారని పేర్కొన్నారు. రైతులందరూ సకాలంలో సదస్సుకు హాజరుకావాలని కోరారు.

గ్రూప్-3 పరీక్ష ప్రశాంతం

అనంతగిరి: గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం రెండు పేపర్లు, సోమవారం ఒక పేపర్‌కు పరీక్ష నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా పరీక్ష ముగిసిందని అధికారులు పేర్కొన్నారు.

కళాశాల నిర్మాణానికి సహకారం

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి డాక్టర్ రజిత, గిరి దంపతులు సోమవారం రూ.5లక్షల విరాళం చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కళాశాల భవన నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్, నాయకులు విశ్వం, చెన్నయ్య, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

చేవెళ్ల: పాఠాలు నేర్చుకునే విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి తరగతి గదుల్లో పాఠాలు బోధించారు. మండలంలోని ఊరెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కస్తూర్బాల్లో అధ్యాపకుల కొరత

- నష్టపోతున్న విద్యార్థినులు
- విద్యాసంవత్సరం కోల్పోతామంటూ ఆందోళన
- బోధన సిబ్బందిని నియమించాలని ప్రిన్సిపాల్‌ను కోరిన తల్లిదండ్రులు



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

పూడూరు: పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేజీబీవీలను అధ్యాపకుల కొరత వేధిస్తోంది. దీంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. చదువు చెప్పేవారు లేక నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పూడూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు పూర్తి స్థాయిలో పాఠాలు బోధించే వారు లేక నష్టపోతున్నారు. ఆంగ్లం, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధించే వారు లేరని ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పరీక్షల్లో ఉత్తీర్ణ ఎలా సాధించాలని ప్రశ్నిస్తున్నారు. విద్యాసంవత్సరం కోల్పోయే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించాలని ప్రిన్సిపాల్ పాతిమాను కోరినా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఆరోపించారు.

ఖాళీలను పూరించాలి

విద్యార్థినుల ఆందోళన నేపథ్యంలో వారి తల్లిదండ్రులు సోమవారం ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించాలని కోరారు. వారికి మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఇలా ఉంటే, మారుమూల జిల్లాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడించి, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు సతీష్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బీజేపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



పూడూరు: పోలీసుల అదుపులో నాయకులు



బొంరాస్‌పేట: మాట్లాడుతున్న నాయకులు

పూడూరు: జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను కలిసేందుకు మన్నేగుడకు వచ్చిన బీజేపీ నాయకులను కండ్లపల్లి గేటు వద్ద చన్గోముల్ పోలీసులు అడ్డుకున్నారు. సభ్యులను కలిసేందుకు వచ్చిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, జిల్లా కార్యదర్శి వెంకటయ్య, మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు ఉన్నారు.

అడ్డుకోవడం సరికాదు

బొంరాస్‌పేట: రైతులకు మద్దతుగా ఎస్సీఎస్టీ జాతీయ కమిషన్‌ను కలిసేందుకు లగచర్లకు వస్తున్న బీజేపీ నేతలను అడ్డుకోవడం సరికాదని ఆ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. లగచర్ల దాడి ఘటన జాతీయ స్థాయికి వెళ్లిందని, గిరిజనులకు అండగా ఉండేందుకు వస్తున్న నేతలను అడ్డుకోవడం, అరెస్టు చేయడం మంచిది కాదని హితవు పలికారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ నర్సింహులు, బాబయ్యనాయుడు, ఓబీసీమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్, నాయకులు నాగూరావు, మల్లేశం తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో వసతుల కల్పనకు కృషి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: నాగర్‌గూడ బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగర్‌గూడ బస్టాండ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బండ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. బస్ స్టేషన్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతిరోజు ఈ బస్టాండ్‌కు 30 గ్రామాల ప్రజలు, విద్యార్థులు వస్తుంటారని పేర్కొన్నారు. వారికి కూర్చోవడానికి సరిగా కుర్చీలు లేవని, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది ప్రయాణికులు పడుతున్నారని ఆయన వెల్లడించారు. రవాణా శాఖ మంత్రితో మాట్లాడి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు ఖాజామీయా, రవీందర్‌నాయక్, జంగయ్య, సత్తయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.

సమాఖ్య అభివృద్ధికి కృషి చేయాలి



చేవెళ్ల: మహిళా సంఘాల అభివృద్ధిపై చర్చిస్తున్న సభ్యులు

ఏపీఎం భగవంతు

కేశంపేట: మండల మహిళా సమాఖ్య అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఏపీఎం భగవంతు అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో ఇందిరా మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎం మాట్లాడుతూ.. మహిళా సభ్యులు సంఘాల్లో లేనివారిని గుర్తించి సంఘంలో చేర్పించాలని సూచించారు. బ్యాంక్ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో మహిళలు ప్రమాదబీమా, రుణబీమాతో పాటు డ్వాక్రా బజారుల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు చైర్మన్ల ఏర్పాటు, ఎంటర్‌ప్రైజెస్‌ల ఏర్పాటు, వడ్డీ లేని రుణాలు, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర విషయాలను ఈ సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో సీబీఓ ఆడిటర్ యాదగిరి, సీసీలు రాంచంద్రయ్య, నర్సింహ, తిరుపతమ్మ, మల్లేశ్‌తో పాటు భాగ్యలక్ష్మి, సుగుణమ్మ, గీత పాల్గొన్నారు.

అభివృద్ధికి చర్యలు

చేవెళ్ల: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు మహిళా సమాఖ్య ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం మండల మహిళా సమాఖ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్యల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని మహిళా సంఘాల్లో లేని మహిళలను సంఘాల్లో చేర్పించాలని రుణబీమా, ప్రమాద బీమా చేయించాలని, చిరు వ్యాపారాలను ప్రోత్సహించాలని సూచించారు. బ్యాంక్ రుణాలు ప్రతి ఒక్క సభ్యురాలికి అందేవిధంగా చూడాలని, నాటుకోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించడం, మహిళాశక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు, వడ్డీలేని రుణాలు అందజేయడం తదితర అంశాలపై మహిళా సంఘాల సభ్యులతో చర్చించారు. మహిళా సంఘాల సభ్యులు వీటిని ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు, ఎంఎస్ సిబ్బంది, ఏపీఎం తదితరులు ఉన్నారు.

మహిళా శక్తిని చాటాలి

కొందుర్గు: ప్రభుత్వం ప్రజాపాలన వారోత్సవాల నిర్వహణలో మహిళా శక్తిని చాటాలని ఏపీఎం జయమాలిని సూచించారు. సోమవారం మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాది కాలంలో మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా అందిన రుణాలు, వారి ఆర్థిక స్థితిగతుల గురించి చర్చించారు. సమావేశంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శివలీల పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధారూరు: మండల పరిధిలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించనున్నామని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ వై.సత్యనారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ స్పీకర్ సూచన మేరకు మోమిన్‌కలాన్, గురుదోట్ల, రాంపూర్‌తండా, నాగారం గ్రామాల్లో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, పీఏసీఎస్ పాలకవర్గం, అధికారులు, తాజామాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొనాలని కోరారు.

వరి కొయ్యలను కాల్చవద్దు

కుల్కచర్ల: వరి పంట పూర్తయిన తరువాత కొయ్యలకు నిప్పుపెట్టరాదని మండల వ్యవసాయాధికారి వీరస్వామి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి కోతలు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం సేకరించిన తరువాత కొయ్యలను భూమిలోనే ఉంచి కాల్చడం వలన భూ లవణాలు, పోషకపదార్థాలు దెబ్బతింటాయని, దీని వలన తదుపరి పంట దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఆ కొయ్యలను అలాగే భూమిలోనే ఉంచి దున్నడం వలన మెరుగైన ఫలితాలు ఉంటాయని, రైతులు ఈ అంశాలను గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం

బంట్వారం: కళాశాల విద్యార్థులకు మర్పల్లి మండల కేంద్రంలో హాస్టల్ సౌకర్యం కల్పించినట్లు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి భీంరావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధి విద్యార్థులు మర్పల్లిలో విద్యనభ్యసించినట్లయితే హాస్టల్ అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, ఐటీఐలలో చదువుకొనే వారు వసతి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో సంబంధిత వార్డెన్‌ను సంప్రదించాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9398873755 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తాండూరు రూరల్: సీసీఐ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీసీఐ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు శరణప్ప కోరారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరణప్ప మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతం సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా ఈఎస్ఐ ఆస్పత్రి సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, సీసీఐ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

షాద్‌నగర్‌రూరల్: రైతులు వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని మండల అగ్రికల్చర్ అధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ సందర్శించారు.

కొనసాగుతున్న కులగణన

సర్వే ప్రక్రియను పరిశీలించిన అధికారులు



మోమిన్‌పేట: వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్, పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: కులగుణన సర్వే ప్రశాంతంగా కొనసాగుతుందని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఒక్కో కుటుంబం నుంచి సమాచారం సేకరించేందుకు 40 నిమిషాల సమయం తీసుకుంటుందని వెల్లడించారు. ఉదయం 8గంటలకే రైతులు పొలాల బాట పడుతుండటంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారు ఇంటి వద్ద ఉన్నప్పుడే ఎన్యుమరేటర్లు వివరాలు తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల పరిధి కాస్లబాదు గ్రామంలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మండల పరిధి 29 గ్రామాల్లో 85మంది ఎన్యుమరేటర్లతో 9వ తేది నుంచి సర్వే జరుగుతోందని తెలిపారు. సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

గడువు పెంచాలి

బంట్వారం: సమగ్ర కుటుంబ సర్వే గడువును మరో 15 రోజులు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. సర్వే ఈ నెల 19వ తేదీతో ముగియనుండడంతో ప్రక్రియ అసంపూర్తిగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50శాతమే కులగణన జరిగిందని, సర్వే వంద శాతం పూర్తి కావాలంటే పక్షం రోజుల పాటు పెంచాలని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు పాఠశాల విధుల అనంతరం మధ్యాహ్నం నుంచి సర్వేకు వెళ్లడంతో ఆలస్యమౌతుందని, గడువు పెంచి సమగ్ర వంతంగా పూర్తి చేయాలని సూచించారు.

తప్పులు లేకుండా..

దోమ: కులగణన తప్పులు లేకుండా నిర్వహించాలని ఎంపీపీ మాజీ సభ్యురాలు అనసూయ ఎన్యుమరేటర్లకు సూచించారు. మండల పరిధి పోతిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆమె పరిశీలించారు. సర్వే వలన అందరికీ మేలే జరుగుతుందని, అపోహలు వీడి అధికారులకు సహకరించాలని ప్రజలను కోరారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్



శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ అన్వేష్ రెడ్డి

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. సంఘం ఇచ్చిన చలో కొడంగల్ పిలుపు మేరకు కొడంగల్ వెళ్లేందుకు సిద్ధమైన గిరిజన సంఘాల నాయకులను ఎస్ఐ అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. లగచర్ల ఘటనలో గిరిజనులపై పోలీసులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మంచిదికాదన్నారు. రాత్రి పూట పోలీసులు మహిళలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వారి భూములను లాక్కుంటూ, వారిపైనే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులపై జరిగిన దాడి ఘటనను సాకుగా చూపుతూ.. ఇష్టంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పేదల భూములు తీసుకుని పెట్టుబడిదారులకు ఇచ్చేందుకు ప్రభుత్వం చేసిన కుట్ర బహిర్గతమైందని విమర్శించారు. గిరిజనుల భూములను లాక్కోవాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థుల అభివృద్ధిలో అధ్యాపకులే కీలకం

ఎన్ఆర్ఎస్ఈ ఇస్రో శాస్త్రవేత్త డా.శివశంకర్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త శివశంకర్

మొయినాబాద్‌రూరల్: ఉన్నత విద్యలో విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకులే కీలకమని, ఫ్యాకల్టీ అభివృద్ధి మెరుగుపరిచేందుకు ఇలాంటి సదస్సులను నిర్వహించాలని ఎన్ఆర్ఎస్ఈ ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శివశంకర్ అన్నారు. మండల పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో వారంరోజుల పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని సోమవారం డాక్టర్ శివశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. వారి భవిష్యత్ అధ్యాపకులపైనే ఆధారపడి ఉంటుందని, నాణ్యమైన విద్యను అందించడంలో ఫ్యాకల్టీ బృందం కృషి చేయాలన్నారు. రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఎన్ఆర్ఎస్ఈ ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ జయసక్సేన మాట్లాడుతూ.. నేటి సమాజంలో పోటీతత్వం పెరిగిపోయిందని, దానికి అనుగుణంగా విద్యార్థులను అభివృద్ధి చేయడంలో ఫ్యాకల్టీ కృషి చేయాలన్నారు. విద్యాజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబారెడ్డి పాల్గొన్నారు.

24న వన భోజనం

కొడంగల్ రూరల్: కార్తీకమాసంలో నిర్వహించనున్న వన భోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జంగమ సమాజం కొడంగల్ నియోజకవర్గ కోశాధికారి శ్రీశైలం కోరారు. ఈ నెల 24న కోస్గి పట్టణంలోని దౌల్తాబాద్ రోడ్‌లోని అనంత శ్రీనివాస్‌గుప్త వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. వన భోజనానికి ముందు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సమాజం సభ్యులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

చిన్నారులు బాగా చదువుకోవాలి



పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఎంఈఓ వెంకట్

దోమ: బాలబాలికలు మంచిగా చదువుకోవాలని మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. సోమవారం మండల పరిధి ఐనాపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ.. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులగా తోటి వారికి పాఠాలు చెప్పిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. బాలలు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం స్వయంపాలనలో భాగంగా కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయుల పాత్రలు పోషించిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబుచంద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేగ్యా, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, సూర్య, ముజీబ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటకు పందుల బెడద



పందులు తొక్కిన వరిపంట

పరిగి: ఊర పందుల బెడదతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. చేతికి వచ్చిన వరి పంటను నాశనం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. మండల పరిధి మిట్టకోడూర్ గ్రామంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పంటలను తొక్కి పాడు చేస్తున్నాయని, గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వరి కోతలు ప్రారంభం అయ్యే సమయాన పందులు నష్టం కలిగిస్తున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి పందుల బెడద నుంచి పంటలను కాపాడాలని కర్షకులు కోరుతున్నారు.